కథ

# అంతరంగం

శ్రావణి మునిసుందరం

రైలు ముందుకు పోతూంది.

కిటికీలో నుండి చూస్తుంటే చెట్టూ, చేనూ, కొండా, కోనా వెనక్కిపోతున్నాయి నా ఆలోచనల లాగే. నా జ్ఞాపకాల్లాగే...

''చాలా సంతోషం బాబూ!''

''అంతా మీ ఆశీర్వాదం నాన్నా!''

చిరునవ్వు చారిక అట్లా మెరిసి యిట్లా వెళ్ళిపోయింది గోపాలం పెదిమలపై. పల్చటి నీలినీడలు పరుచుకున్నాయి అతడి ముఖంపై.

మౌనంగా కిటికీ కేసి చూస్తూ నిలబడ్డాడు.



''నేను రేపు బయలుదేరుతాను నాన్నా''

''రాజా!'' ఆపాలన్న ఆదుర్దా ఆ పిలుపులో.

''చెప్పండి నాన్నా!''

''నీకప్పుడు ఏడు సంవత్సరాలు. మనం యీ పట్నానికి బతకడానికి వచ్చాం''

''తెలుసు నాన్నా''.

''నువ్వు ఉద్యోగంలో చేరే ముందు మన వూరు సీతారామాపురం వెళ్లి రావాలి''.

''అలాగే నాన్నా!''

''అక్కయ్యచెరువు శివాలయంలో దేవుడికి పూజ చేసి రావాలి. ఎందుకో అక్కడికి వెళ్లాక నీకే తెలుస్తుంది''.

''తప్పకుండా. అయితే నేను రైల్లో వెడతాను నాన్నా''.

''నీ యిష్టం''

రైలు మిట్ట ఎక్కుతున్నట్టుంది. టన్నుల బరువును నెత్తిన పెట్టుకుని నడుస్తున్న మధ్య తరగతి జీవితంలా.

ముసురుకున్న ఆలోచనలు.

జీవితం అంటే అలజడి. కాలమా? క్షణమాగదు. అయినా... ఏదో ఆశ. మనిషిని నడిపిస్తుంది. ఎప్పుడూ నడిపిస్తూనే వుంటుంది.

ఆశయం, ఆదర్శం అంటే అర్థం తెలిసి పోరాడే వారిలో స్వార్థం వుంటుంది. అర్థం తెలియక పోరాటం సలిపే పామరునిలో....

శ్రమించి అల్లుకున్నగూడు పెనుగాలికి చెదిరిపోతే పిచ్చుక ఎంత బాధ పడుతుంది.

రోజూ యీ గాలి ఎన్ని నిట్టూర్పులు మోసుకెళుతుందో...

చిన్నిచిన్ని చేతులు కట్టిన గుజ్జనగూళ్లు... కెరటాలు చెరిపేసి పోతూంటే... పసిగుండెల చూపులు... ఆశతో నిండినవో నిరాశతో కుంగినవో... అంచనా వేయడం సులభమా?

పూడి స్టేషన్‌లో రైలు ఆగింది. ఇంకో 15 కిలోమీటర్లు. తడుకు స్టేషన్ వచ్చేస్తుంది.

నేను పుట్టిన వూరు సీతారామాపురం. జ్ఞాపకాల దొంతరలో నా జన్మభూమి దృశ్యం. కొండలమధ్య వెళ్లే యిరుకుదారి. రైలు దిగి వెళ్లాలంటే భయం భయంగా వుండేది. వూరి గెవినిలో పెద్దరాగిచెట్టు. దాన్ని జండా మాను అనేవారు. నాగూరు మీరాసామి జెండాలు ఎగురుతుండేవి. నడివీధిలో గంగరాయి. తూరుపుగా గ్రామ దేవత గుడి. తామర పూలతో నిండిన అక్కయ్య చెరువు. గట్టుమీద పెద్ద వేప చెట్టు. ఆ చెట్టంటే పిల్లలకు భయం. అక్కడ అక్క దేవతలుంటారనే వాళ్లు. గేదెల్ని

చెరువు మొరవలోకి తోలి నా నేస్తగాళ్లు....

రాజా జ్ఞాపకాల తోరణం తెగిపోయింది. కూత వేస్తూ రైలు.... జ్ఞాపకాల కదలికలు నాలో...

నేస్తగాళ్లు రామ్మూర్తి, నారాయణ, లక్ష్మి, ఎట్లా వున్నారో, నాలాగే వాళ్లూ పెద్ద వాళ్లయిపోయి వుంటారు.

లక్ష్మీ... ఎంత అందంగా వుండేది. చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ మాట్లాడేది. అటుకులు, బెల్లం తెచ్చి పెట్టేది. పొడుగాటి వెంట్రుకలు. దువ్వేది కాదు. ఆటల్లో తన జట్టులోనే వుండేది. అమాయకంగా నవ్వేది.

స్టేషన్‌లో దిగి కాలినడకన బయలుదేరాను. ఎద్దు బండి కూడా పోలేని ఎగుడు దిగుడు దారి. ఎద్దుల బండ్లు తిరగడం వల్ల మధ్యన ఎత్తుగా... అటూ యిటూ పల్లం. దారికటూ యిటూ అడ్డం దిడ్డంగా పెరిగిన సర్కారు కంప. మన అభివృద్ధిని తెలియజేస్తూంది. దారి మధ్యలో అక్కడక్కడా పిచ్చి మొక్కలు.

ఏ వూరెళ్లాలి బాబూ! నాతో రైలు దిగిన ఒక పెద్దాయన.

'సీతారామాపురం'

'ఎవరింటికో...' మళ్లీ ప్రశ్న.

'తెలియదు. అక్కడో శివాలయం వుంది. అక్కడికే'.

'నువ్వు గోపాల్‌రావ్ కొడుకువా?'

'మీకెలా తెలుసు'

'మాదీ ఆ వూరే'.

'అయితే మీకు నారాయణ తెలుసా?'

'తెలుసు బాబూ! ఐదేళ్లయింది ఏదో జరమొచ్చి కాలమైపోయాడు'.

నా గుండెల్లో చిన్నదిగులు కెరటం. నారాయణ ఆ రోజుల్లోనే న్యాయం కోసం పోట్లాడేవాడు. వాడు పోయాడంటే న్యాయానికి కాలం చెల్లిందా?

'మరి రామ్మూర్తో'.

'వాడు పెళ్లయ్యాక అత్తోళ్ల వూరికి వెళ్లిపోయాడు. వాడికిక్కడ జరుగుబాటు లేదు కదా. అందుకే'.

'కోప్పడకు పెద్దాయనా? వెంకటాద్రిగారి అమ్మాయి లక్ష్మి ఎక్కడుంది?' అప్పజెప్పినట్టు అడిగాను.

పెద్దాయన కాస్త ఆగాడు.

'మీకు తెలియదా అన్నాను!'

'లక్ష్మిని కన్న దౌర్భాగ్యుణ్ణి నేనే బాబూ!'

'మీరు వెంకట్రాది గారా!'

తల వూపాడు పెద్దాయన.

'లక్ష్మికేమయింది?'

'నా మొండి పట్టుదలకు దాని జీవితం బుగ్గి అయింది'.

'అంటే?'

'డబ్బున్న వాడి కొడుకని క్రిష్టారావు కిచ్చి పెళ్ళిచేశాను. వాడికదేదో గుండె రోగమట. దాచి పెట్టారు. ఏడు తిరక్కుండానే నా కూతురు...' ఏడ్చాడు పెద్దాయన.

నాకు తల తిరిగినట్టయింది. ఏదో పోగొట్టుకున్న వాడిలా శూన్యంలోకి చూశాను. ఆరు సంవత్సరాల ఆరిందా నా కళ్లలో కదలాడింది. ఊరు చేరే వరకూ మా మధ్య మౌనం రాజ్యమేలింది.

ఆలయం దగ్గిర స్వామీజీ ఆదరణ, ఆతిథ్యం నచ్చింది.

చతుర్దశి చంద్రుడు. చల్లని పైరగాలి. ఆరుబయట మంచంపై పడుకున్నాను.

'స్వామీజీ! నాన్నగారు ఏమీ చెప్పలేదు. ఈ ఆలయం విశేషాలు మీరు చెప్పండి'.

'అలసిపోయి వుంటావు. విశ్రాంతి తీసుకో బాబూ! తెల్లవారితే నీకే తెలుస్తుంది'.

అలసిన నేను ఎక్కువ ఆలోచించలేకపోయాను. నిద్రాదేవి గాఢాలింగనంలో నన్ను నేనే మరచిపోయాను.

శరీరం నిద్రపోతూంది. చేతనస్థితిలో వున్న మనసు అర్ధచేతన స్థితికి చేరుకుంటుంది అప్పుడు. జాగ్రదావస్థలో కన్నా సుషుప్తిలోనే మనసు వేగం ఎక్కువగా వుంటుంది. ఎన్నో... ఎన్నెన్నో ఊహించని, ఆలోచించని దృశ్యాల్ని... చూస్తుంది మనసు ఆ స్థితిలో.

శ్రమ, చెమట రూపుదాల్చి ఎదురుగా నిలబడితే ఎట్లా వుంటుందో అట్లా వున్నాడా మనిషి. చేవదేరిన అవయవాలు, బక్కపలచటి కాయం. నల్లగా కష్టం చేసి అలసిన మొగం, సంస్కారం లేని జుట్టు, నెరిసిన గడ్డం, నేను చూడని మనిషి, మునుపెన్నడూ మనసులో మెదలాడని మనిషి. నన్నే కన్నార్పకుండా చూస్తున్నాడు. ఆ చూపులో ఏదో ఆనందం, తృప్తి, తెలియని చల్లదనం, ఆ చూపు నన్ను భయపెట్టడం లేదు. వెన్నెల్లావుంది. నాకు ధైర్యం వచ్చింది.

''ఎవరు మీరు? మీ చూపుల చల్లదనాన్ని నా కళ్లకు ఎందుకిస్తున్నారు..''

మౌనం... మౌనం... ప్రకృతిలోనూ మౌనమే. గాలి కూడా ఆగిపోయి యీ వింత దృశ్యాన్ని చప్పుడు చేయకుండా చూస్తున్నట్టుంది.

''నా కలలు నేటికి ఫలించాయి. నా ఆనందానికి మేర లేదు... లేదు'' ఆ కళ్లు చెమర్చాయి. రెండు కన్నీటి చుక్కలు నాపై పడినయ్.

''కన్నీళ్లా?''

''కాదు. ఆనందం కార్చిన చన్నీళ్లు... బతికిన న్నాళ్ళూ నేను ఏ ఆశతో పోరాటం చేశానో అది తీరని రోజు ఇది. నా ఆశలకు, కోరికలకు రూపమిచ్చిన వాడివి నువ్వు''.

''తెలిసేటట్టు చెప్పండి. మీరెవరు? మీ కోరికలు, ఆశలు ఏమిటి? నేను మీ కోర్కెల్ని ఆశల్ని తీర్చడమేమిటి?''

''మేమిద్దరం అన్నదమ్ములం. విను బాబూ! మా అన్నకు ముగ్గురు కొడుకులు. నీ నాన్న గోపాలం అందరిలోకి సిన్నవాడు. నేను నీ సినతాతయ్యను''.

''నాన్న అనే వారు. నీకొక పిచ్చి తాతయ్య వుండేవాడ్రా అని. వివరాలు తెలియవు''.

''ఇప్పుడు వింటున్నావు గదా. మనం బూమీ పుత్రాలేని పేదోళ్లం.

సీతారామానాయుడు బూమిని గుత్తకు చేసే వాళ్లం. వానలు సరిగ్గా పడేవి కావు. నీళ్ల కరువు బాగా వుండేది. గుత్తగింజలు కొలిచేయగా మిగిలినవి బొటాబొటిగా గంజి తాగడానికి సరిపోయేవి. నేను రకరకాల కూలీ పనులు చేసేవాడిని... 'వేన్నీళ్లకు సన్నీళ్లు' తోడయినట్టు. ముసిలి ఎద్దులతో పొలం దున్నినట్టు బతుకు సాగేది. సిన్నాసితక యాపారాలు కూడా సేసేవాడిని సేద్దం పనులు లేనప్పుడు.

ఊరి కరణం రామసామితో నాకు బాగా స్నేహితం. ఆయన ఏడికి పోవాలన్నా నన్ను కూడా రమ్మనేవాడు. ఒకసారి ఆయనకు పెద్ద జరం వచ్చింది. పట్నం పోతేనే గాని లాభం లేదన్నాడు ఊర్లో వైద్యుడు చినసామి. రైలెక్కిపోవాల. రైలు టేషన్‌కు ఎద్దులబండి కట్టించుకుని ఆయనతోబాటు నేనూ బయలుదేర్నా. పెద్దాసుపత్రి తిరుపతిలో వుండాది. అమ్మో! ఆసుపత్రిలో ఎంతమంది రోగులు. ఎన్నిరోగాలు. వాళ్లను చూసే డాకటేరులు నరుసమ్మలు, గందరగోళంగా వుండింది.

పెద్ద డాకటేరు వచ్చాడు. సూదిమందు ఎక్కించాడు. నాల్రోనాటికి రామసామి లేసి కూసున్నాడు.

'ఒరే సిన్నోడా! సూస్తివా. డాక్టర్ సూది మందుతో జరాన్ని తరిమికొట్టినాడ్రా' అన్నాడు.

నాకు పేరు లేదు. అంతా 'సిన్నోడా' అనేవాళ్లు. అదే నా పేరు అయిపోయింది.

'అనా! రామసామన్నా! మనూళ్లో ఎవురైనా డాకటేరు సదువు సదవగూడదా!' అన్నా.

'సదవచ్చురా. డబ్బు గావాల. సదివించే ఆలోచన పెద్దోళ్లకుండాల. మనోళ్లు ఎంతసేపూ డబ్బు మిగిల్తే సాలు వాడికయ్య కొందామా, ఈడికయ్య కొందామా అని ఆలోశన చేస్తారే గాని, సదివిద్దామనే మునాస ఎవుడికి లేదు గదరా. నాకా బిడ్డలు లేరు..'

'అనా! మా పిల్లకాయలుండారు గదా. సదివిత్తా నన్నా. నాకు కొంచెం దారి సూపు. తిండీ నిద్రా మానేశ



యినా కాయకష్టం చేసి దుడ్లు సంపాదిస్తా. సదివిస్తా'.

'ఓరి పిచ్చి నాయాలా! నీకు పెళ్లే కాలేదు గదరా'. నవ్వినాడు రామసామి.

'అనా! నేను పెండ్లే సేసుకోను. మా అన్నకు ఇద్దరు పిలకాయలుండారు. ఇప్పుడు మళ్లీ నీళ్ళు పోసుకోనుండాది మా ఒదినె. వాళ్లను సదివిస్తా. మా ఒదినె బూదేవమ్మ మా అన్న ఏమీతెలియనోడు. నేను పెండ్లి సేసుకుంటే వాళ్లగతేం గావాల. అందుకే వాళ్లే నా బిడ్లను కొని సదివిస్తా. నీ మీదొట్టు. ఈ బూమి మీదొట్టు అన్నా'.

'అట్నే కానీ సిన్నోడా!' అన్నాడు రామస్వామి.

ఊళ్లో పంతులూ సాయం చేశాడు. తిరుపతిలో రామును, రఘునూ పెద్దబడిలో సేర్పించాను. ఆ సంవత్సరమే మీ నాన్న పుట్టాడు.

అదేం మాయో తెల్దు. వానలు కురవలా. ఒకటి, రెండు కాదు ఎనిమిదేళ్లు. నీటికి, కూటికి జనాలు అల్లాడిపోయారు. కరువన్నారు. సెప్పతరంగాని కరువు. అగ్గి వాన మాదిర్తో ఎండలు. సీమసీమంతా కరవే అన్నారు. ఒకటే పోరు గాలి. పచ్చంగా వుండే కయ్యలన్నీ నెర్రెలు బడిపోయె. ఆ రోజులు గుర్తుకొస్తే ఎమికలు వణికిపోతాయి.

సేద్దం పనులు ల్యా. బావులన్నీ బావురుమనే. కుంటలు, కాలవలు ఎండిపోయే. తడి అన్నది ఏ పాతాళానికో పోయే.

ఎప్పుడో సమత్సరంలో ఒకసారి రెండు మూడు పదున్లు పడేది. ఆ వానకు సజ్జల పంట పండించే వారు. ఆ సద్ద సంగటే గతి. పెద్దపెద్ద ఆసాములు కూడా ఒణికిపోయారు ఆ కరువుదెబ్బకు. శానా మంది ఎక్కడికెక్కడికో వలస పోయారు. కొందరు పట్నాలకెళ్లిపోయారు. అయినా నేను ధైర్యం పోగొట్టుకోలా, అడివికిపోయి కట్టెలు తెచ్చి అమ్మినా, సమ్మెటతో బండరాళ్ళు పగలగొట్టే పన్జేసినా. ఎవురు కూలికి పిలిసినా పరిగెత్తికెళ్లినా. ఇళ్ల కట్టడాలకు రాళ్లు మోసినా, నా పిల్లకాయలను సదివించాలన్న పట్టుదలతో సేయగల పనులన్నీ సేసినా, దుడ్డు పిలకాయలకు పంపినా.

ప్రతి ఏడూ తిరపతిలో గంగజాతర జరగతింది. వద్దన్నా వినకుండా వెళ్లాడు రఘు. రెండో రోజు తిరిగొచ్చాడు. వచ్చిన కొంతసేపటికే వాంతి సేసుకున్నాడు. బేదులు కూడా ఆరంభమైనాయి. వంటికి పడని కూడు తినుంటాడు అనుకున్నాం. కానీ రోజంతా అట్లానే ఉండింది. ఊర్లోని నాటువైద్యుడు నోరు చప్పరించాడు. దీనికి సూది మందు పడాల. పట్నానికి తీసుకుపోండి అన్నాడు. నా గుండెలు జారిపోయాయి. పట్నం అంటే డాకటేరంటే మాటలా? కరువుతో మాడిపోతున్న బతుకులకు ఇవేం ఎతలురా సామీ అనుకుంటా బండి కట్టించా. రేపు తెల్లారి తొమ్మిదిగెంటల దాకా రైలుబండిలేదు. ఇరవైమైళ్లు పోవాల. గతుకుల దారి. ఎప్పుడు సేరుకుంటాం. అంతవరకు బిడ్డ గతేం కాను. 'ఏడు కొండలోడా బారం నీదే సామీ!' ఎద్దుల్ని అదిలిస్తున్నాను.

బాపనపట్టు దగ్గరకొచ్చాం. మా వదిన రఘు తల వొళ్లోపెట్టుకొని కన్నీళ్లు కారస్తా వుంది. మా అన్న మోకాళ్ల మీద తల పెట్టుకొని కూర్చున్నాడు.

'సిన్నాన్నా!' అన్నాడు రఘు. ఏడు మట్ల బావిలోంచి వచ్చినట్టుండాది ఆ మాట. బండిని నిలిపా. 'నాయనా రఘూ! వచ్చేసినాం రా. ఇంకొంచెం సేపిట్లో తిరపతి వచ్చేస్తింది. పెద్ద డాకటేరు దగ్గరకెడదాం. సైకిలేసుకొని రామసామి ముందే ఎళ్లుండాడు. బయపడొద్దు బిడ్డా!'

నా మాట వింటున్నాడో లేదో తెలీదు. వాళ్ల అమ్మ కళ్లల్లోకి చూస్తూ తల వాలేశాడు. నా దీపం ఆరిపోయింది. నా గుండెకాయ రెండుగా సీలింది. ఆ సీకటి రాత్రిలో మా ముగ్గురి గుండెగోస ఏ దేముడికి వినిపించి వుంటాది.

రాము కాలేజీలో సేరతానన్నాడు. డాకటేరు సదువు సదవతానన్నాడు. మా అన్న ఒప్పుకోలేదు. కరువుతల్లి క్రూరంగా తాండవమాడతా వుండాది. అప్పుల్జేస్తే తీర్చేదెట్లా అన్నాడు మా అన్న. నేను ఒప్పుకోలేదు. ఎంత కష్టం రానీ వాణ్ణి సదివించాల్సిందే అని పట్టుబట్టా. రెండేండ్లు. ఆ రెండేండ్లు సదివేస్తే డాక్టేరు సదువులో సేరి పోవచ్చన్నారు. ఒకటికి రెండింతలు కష్టపడ్డా. పీనిగె కష్టం జేసినా.

**ఎప్పుడో సమత్సరంలో ఒకసారి రెండు మూడు పదున్లు పడేది. ఆ వానకు సజ్జల పంట పండించేవారు. ఆ సద్ద సంగటే గతి. పెద్దపెద్ద ఆసాములు కూడా ఒణికిపోయారు ఆ కరువుదెబ్బకు. శానామంది ఎక్కడికెక్కడికో వలస పోయారు. కొందరు పట్నాలకెళ్లిపోయారు. అయినా నేను ధైర్యం పోగొట్టుకోలా, అడివికిపోయి కట్టెలు తెచ్చి అమ్మినా, సమ్మెటతో బండ రాళ్ళు పగలగొట్టే పన్జేసినా. ఎవురు కూలికి పిలిసినా పరిగెత్తికెళ్లినా. ఇళ్ల కట్టడాలకు రాళ్లు మోసినా, నా పిల్లకాయలను సదివించాలన్న పట్టుదలతో సేయగల పనులన్నీ సేసినా, దుడ్డు పిలకాయలకు పంపినా.**

ఇంక ఆర్నెల్లే. రామూ డాకటేరు సదువులో సేరిపోతాడు. ఈ ఏడు వానలు కురిస్తే... సదివించడం కష్టం గాదు. ఆ దేముడు సల్లంగా సూడాల. ఈ కరువు పోవాల. పుష్కలంగా నీళ్లుంటే రైతుకు కష్టమే తెల్దు.

నిజ్జంగానే దేముడికి దయ గల్గింది. బాగా వానలు కురిసాయి. కరువు తీరేలా కురిసాయి. అక్కయ్యసెరువు నిండు గర్భిణి మాదిర్తో వుంది. ఏడ జూసినా నీళ్లే.

ఇంక బయం లేదు. కష్టం చేసే ఓపికిచ్చినాడు దేముడు. కొత్త సత్తువ వచ్చింది నాకు. సేద్దం పనులకు కొదవ లేదు. సంపాదిస్తా. ఓణ్ణి డాకటేరు సేస్తా.

కానీ... నా సత్తవ సత్తుబండయినాది. నా తల రాత నన్ను లాగి తన్నింది. శని నెత్తిన కూర్సోనుంటే ఎంత ఆశ పడినా, కష్టపడినా లాబమేముంటుంది. రాము పరీక్ష పోయిందన్నాడు. మళ్లా సదవమన్నా... మళ్లీ తప్పాడు.

నిక్కరు సొక్కాయీ మారింది. క్రాపు మారింది. కండ్లకు నల్ల కళ్లద్దాలొచ్చాయి. మాట మారింది. కాలం మారిందా! సొరాజ్జం యీ మద్దెనే గదా వచ్చింది. మాటకు మాట అనడం నేర్చుకున్నాడు. వాడు బాగా మారిపోయాడు. తిరగ బడడం నేర్చుకున్నాడు. ఇంక సదవనని కరాకండిగా సెప్పేశాడు.

బండరాయి నా నెత్తిన పడినట్టైంది. నా తల దిమ్మ తిరిగింది. నా గుండెకాయ నన్ను వొదిలి పెట్టిపోయినట్టయింది.

నేను ఏమాశించాను? ఏ ఆశతో బతికాను? ఎవరి కోసం ఎద్దులా కాయ కష్టించేశాను! ఎందుకిట్లా జరిగింది? ఆలోశనలు... మనసంతా సీకట్లో కుమ్ములాడుకున్నట్టుంది.

కాళ్లు మెల్లిగా సెరువు గట్టు మీదున్న ఏపసెట్టు కిందకెళ్లి ఆగిపోయాయి. బలమైన బాద బాధించినప్పుడు, బాగా ఆకలేసినప్పుడు, ఎవరి మీదైనా బాగా కోపం వచ్చినప్పుడు ఆ ఏప సెట్టు నీడలోనో సేద తీరేవాడిని. పిల్లంగట్టి ఊదుకుంటూ నా కష్టసుఖాలను మురిసిపోయే వాడిని. కన్నతల్లి ఎట్టా వుంటుందో తెలియని నాకు ఆ సెట్టు నీడే అమ్మ ఒడి.

కానీ ఇప్పుడు ఆ ఒడికి కూడా నన్ను సేద తీర్సే శక్తి లేనట్టుంది. నా ఆలోశనలు నన్ను కాల్చుతున్నాయి. గట్టుమీద నిలబడి నీళ్లలోకి తొంగి చూశాను. నా రూపం... బయమేసింది. రేగిన జుట్టు, లోతుకుపోయిన కళ్లు, పీక్కుపోయిన దవడలు, సెమటలు కారుతున్నాయి. గొడ్డలితో సెట్లను నరికినప్పుడు, సమ్మెటతో బండలు పగల గొట్టినప్పుడు నేనిట్టా అయిపోలేదు.

నా రూపం నన్ను సూసి నవ్వుతూంది.

ఏందిరా నువ్వు పొడిసింది. ఒక్కడినైనా సదివించ గలిగావా? ఒట్టు పెట్టుకున్నావే. ఆరుగాలం కష్టం చేశావే. ఇదేనా ఫలితం? నువ్వు పిచ్చోడివి... నువ్వు పిచ్చోడివి....

ఆ నవ్వు బరించలేక పోయాను.

నోర్ముయ్! అరుస్తూ నా రూపం గొంతు పట్టుకోబోయాను.... అంతే''.

అదిరిపడి లేచాను. ఎదురుగా స్వామీజీ చిరునగవు.

''స్వామీజీ! ఆ మనిషి... ఆ మనిషి...''

''మీ తాతగారు. బిడ్డలను చదివించాలని తపించి తపించి రాలిపోయిన అభాగ్యుడు. రా బాబూ! ఆ చోటు చూపిస్తాను...''

చెరువులో అందాలు వొలకబోస్తున్న సూర్యకిరణాలు.

''అదిగో! ఆ రెండు కమలాలు వున్నాయే... వాటికి దగ్గర్లోనే మీ తాతగారి ఆత్మ అనంతాత్మలో కలిసిపోయింది. రోజూ రెండు కమలాలు అక్కడ వికసిస్తాయి. వాటితోనే మీ తాతగారిని పూజిస్తాను. ఈత కొట్టడం వచ్చు గదా''.

ఈదుకుంటూ వెళ్లాను. కమలాలను నా చేతుల్లోకి తీసుకున్నాను. ఏదో తెలియని ఉత్సాహం... ఆనందం... తృప్తి.... మాటలు చెప్పలేని అనుభూతి.... కమలాలను చూస్తుంటే.

ఒక శ్రమజీవి ఆశల కళ్లు పద్మాల రూపంలో రోజూ తన వంశంలో ఒక విద్యావేత్త కోసం, ఒక డాక్టరు రాక కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నట్టుంది.

నాన్న అంతరంగం ఏమిటో తెలిసొచ్చింది.

*

రచయిత సెల్ నెం: **9441302866**